

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



ఎస్వీయూ అధికారుల తీరుపై ఆగ్రహం

విద్యార్థి సంఘాలను అణగదొక్కేందుకు యత్నిస్తున్న ఎస్వీయూ అధికారుల తీరుపై విద్యార్థులు మండిపడ్డారు. - 8లో



వీఐపీలకే మా సేవ!

ముక్కంటి ఆలయంలో అధికారులు వీఐపీల సేవలోనే తరిస్తున్నారు. పోటీ పడి మరీ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

తిరుపతికి ప్రత్యేక రైళ్లు



తిరుపతి రైల్వేస్టేషన్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీవారి బ్రహ్మోత్సవాలు, దసరా, దీపావళి పర్వదినాలను పురస్కరించుకుని తిరుపతి ప్రత్యేక రైళ్లు నడిపేందుకు రైల్వేశాఖ నిర్ణయించింది. సోమవారం ఈ మేరకు వైజాగ్–తిరుపతి ప్రత్యేక రైలు ప్రారంభమైంది. నవంబర్ 25వ తేదీ వరకు ఈ రైలు ప్రతి మంగళవారం తిరుపతిలో విశాఖపట్నం వెళ్లేందుకు అందుబాటులో ఉండనుంది. అలాగే అక్టోబర్ 5 నుంచి 27వ తేదీ వరకు తిరుపతి– అనకాపల్లి మధ్య 8 స్పెషల్ ట్రిన్లు నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటికే రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లను దసరా, దీపావళి సెలవులు పూర్తయ్యే వరకు కొనసాగించనున్నారు. నడికుడి– శ్రీకాళహస్తి నుంచి తిరుపతి నడిచే రైళ్లను సైతం కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని రైళ్లను ప్రకటించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది.

స్విమ్మింగ్, తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఉమ్మడి జిల్లా అండర్–14, 17, 19 బాలబాలికలకు స్విమ్మింగ్, తైక్వాండో జట్ల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి పి.కిషోర్ కుమార్, మహిళా కార్యదర్శి ఎల్.భార్గవి తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్టు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాలకు స్విమ్మింగ్–81217 77077, తైక్వాండో– 90329 56111నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'యువ తరంగ్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్–కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న యువ తరంగ్–2025 కార్యక్రమ పోస్టర్‌ను వీసీ అప్పారావు సోమవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. వక్తృత్వ, సంగీతం, నృత్య, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 విభాగాలలో పోటీలను నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేస్తామని వివరించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు, కల్చరల్ విభాగం డైరెక్టర్ మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్, పీసీ వెంకటేశర్లు, ప్రిన్సిపల్ పద్మావతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుబ్బారావు, వరదరాజన్ విజయసారథిరెడ్డి, డాక్టర్ పాకనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

22 నుంచి 'కోన'లో శరన్నవరాత్రి



విశేషాలంకరణలో ఆదిలక్ష్మి

రాపూరు : మండలంలోని పెంచలకోనలో ఆదిలక్ష్మీదేవికి ఈ నెల 22 నుంచి అక్టోబర్2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 22న సౌభాగ్యలక్ష్మీదేవి, 23న ఆదిలక్ష్మీదేవి ,24న ధాన్యలక్ష్మి, 25న ధైర్యలక్ష్మి ,26న గజలక్ష్మి, 27న సంతానలక్ష్మి, 28న విజయలక్ష్మి, 29న విద్యాలక్ష్మి, 30న రాజ్యలక్ష్మి, అక్టోబర్ 1న ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వివరించారు. 2న విజయదశమి సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం, పూలంగిసేవ, ఉదయం8.30కు అశ్వవాహనంపై శ్రీవారి పారువేట, 9గంటలకు శమీపత్రపూజ, 11గంటలకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ఉదయం నవ కలశ స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, క్షేత్రోత్సవం ఉంటుందని తెలిపారు.

పరిష్కారం లేక.. పడిగాపులు



ఏ అధికారి అయినా వస్తే వినతి ఇద్దామని వేచి చూస్తున్న అర్జీదారులు

పేదలంటే లెక్కలేదు.. దూరాభారం నుంచి వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వస్తారనే కనికరం లేదు. సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేదు.. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే గ్రీవెన్స్‌ను నీరుగారుస్తున్నామనే ఆలోచన లేదు. ప్రభుత్వంపై నమ్మకంతో వచ్చిన వారిని పడిగాపులు కాసే దుస్థితి కల్పించామనే వివేకం లేదు. ప్రజలంటే అణువణువునా నిర్లక్ష్యం.. కష్టం చెప్పుకునేందుకు వచ్చేవారంటే అడుగడుగునా అలసత్వం.. పట్టించుకోకపోయినా మమ్మల్ని ఏం చేయగలరనే చులకన భావం.. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కావేదికకు వచ్చిన పలువురు నిస్సహాయుల అంతరంగం ఇది. వినతుల సమర్పణకు వస్తే.. ఒక్క ఉద్యోగి కూడా అందుబాటులో లేకపోవడంతో కలిగిన నిర్వేదం ఇది. గ్రీవెన్స్ లేదని కనీసం ముందస్తుగా సమాచారం ఇస్తే రాకపోదుము కదా అనే ఆవేదనకు నిదర్శనం ఇది.

- మహిళా సదస్సు పేరుతో గ్రీవెన్స్ రద్దు
- ముందస్తుగా సమాచారం అందించని అధికారులు
- పీజీఆర్ఎస్‌కు పెద్దసంఖ్యలో వచ్చిన అర్జీదారులు
- కలెక్టరేట్ ఎదుట ఆటో, భవన నిర్మాణ కార్మికుల ధర్నా

తిరుపతి అర్బన్ : జాతీయ మహిళా సాధికారిత సదస్సు నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేశారు. అయితే ఈ సదస్సుపై అధికారులకు మూడు నెలల క్రితమే సమాచారం ఉంది. ఈ క్రమంలో నాలుగు రోజులు ముందుగానే గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ఉంటే జిల్లావాసులకు సమాచారం చేరేది. అయితే అధికారులు ఆదివారం రాత్రి ఓ ప్రెస్ నోట్ విడుదల చేసి...గ్రీవెన్స్ రద్దు అంటూ చేతులుదులిపేసుకున్నారు. సోమవారం ఉదయం పత్రికల్లో చూసిన వారికి మాత్రమే ఈ సమాచారం చేరింది. మిగిలిన వారు అర్జీలతో పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌కు వచ్చేశారు. వారికి కూడా గ్రీవెన్స్ లేదని వెంటనే చెప్పి పంపడంతో అధికారులు విఫలమయ్యారు. దీంతో దూరాభారం నుంచి వచ్చిన వారు సైతం గంటల తరబడి అర్జీలను చేతపట్టుకుని కలెక్టరేట్‌లో పడిగాపులు కాశారు. ఎవరో ఒక అధికారి వస్తే వినతిపత్రం సమర్పించేందుకు వేచి ఉన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి సమావేశానికి కలెక్టర్ వెళ్లిపోయారు. మిగిలిన అధికారులు జాతీయ సదస్సు పర్యవేక్షణకే పరిమితమయ్యారు. కనీసం ఒక ఉద్యోగిని అయినా కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి ఉంటే అర్జీదారులు సంతృప్తి చెందేవారు. పట్టించుకునే వారే లేకపోవడంతో అధికారుల తీరుపై పలువురు అర్జీదారులు మండిపడ్డారు.



గ్రీవెన్స్ రద్దు చేశారని తెలియక..కలెక్టరేట్‌కు వచ్చి వెనుదిరిగిన అర్జీదారులు

పింఛన్ కోసం ప్రదక్షిణలు



నా భర్త పి.జేమ్స్ అనారోగ్యంతో మృతి చెందారు. పేద కుటుంబానికి చెందిన నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెంటు భూమి లేదు. వ్యవసాయ కూలి పనులకు వెళ్లాలన్నా ఆరోగ్యం సరిలేదు. వితంతువు పింఛన్ కోసం రెండు నెలలుగా తిరుగుతూనే ఉన్నా. 70 కిలోమీటర్ల నుంచి కలెక్టరేట్‌కు వచ్చా. అయితే ఈ రోజు గ్రీవెన్స్ లేదని చెబుతున్నారు.

–పి.వనజ, కళత్తూరు, కేవీబీపురం మండలం

ఆరు నెలలుగా తిరుగుతున్నా



నా భర్తకు వృద్ధాప్య పింఛన్ ఇచ్చేవారు. ఆయన మృతి చెందారు. వితంతువు అయిన నాకు ఆ పింఛన్ ఇస్తారని ఆరు నెలలుగా కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు వస్తున్నాం. ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా అతీగతీ లేదు. పేద కుటుంబానికి చెందిన వాళ్లం. పూట గడవడమే కష్టంగా ఉంది. పింఛన్ మంజూరు చేస్తే పొట్టపోషణకు ఉపయోగపడుతుంది. అధికారులు నాకు న్యాయం చేయాలి.

– అవినాబీ, లీలామహల్ సర్కిల్, తిరుపతి

సంక్షేమ బోర్డు కోసం భవన నిర్మాణ కార్మికులు



కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. దీనిపై గతంలో నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం వెల్ఫేర్ బోర్డుకు రూ.కోటి కేటాయిస్తామని ప్రకటించారని వెల్లడించారు. అయితే ఇప్పటి వరకు బోర్డు ఏర్పాటు ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లోని 46వేల క్లెయిమ్స్ రిలీజ్ చేయాలని కోరారు. న్యాయం చేయకుంటే చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో నేతలు ఎన్.శ్రీరాములు, పెంచలయ్య, విశ్వనాథ్, ఎండీ రవి, కత్తి రవి, రవి, హరిబాబు, చంద్రబాబు, ఆదం బాబు, రత్నం, ఆనంద రెడ్డి, బాషా, కొండయ్య, రాజారెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

ఆదుకోవాలని ఆటోకార్మికులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

వాహనమిత్రను కోతలు లేకుండా అందరికీ వర్తింపజేసి ఆదుకోవాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఆటోలతో చేరుకుని ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 13.25లక్షల మంది ఆటో కార్మికులు ఉంటే కేవలం 2.90 లక్షల మందికి వాహన మిత్ర అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో ఆటోకార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారని వెల్లడించారు. ఉచిత బస్సు నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేసినా కూలి డబ్బులు కూడా రావడం లేదని వాపోయారు. 90శాతం ఆటోలను కార్మికులు అద్దెకు తీసుకుని నడుపుతున్నారని, వారికి కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకు నేతలు మురళి, బాలసుబ్రమణ్యం, కేతారి రాధాకృష్ణ, జయచంద్ర, ఐఎఫ్‌టీయు నగర కార్యదర్శి లోకేష్, లక్ష్మయ్య, శివ, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్‌డీ రవి మద్దతు తెలిపారు.

వైద్యవిద్యపై బాబు విద్వేషం

- మెడికల్ కళాశాలలపై కక్షగట్టారు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి



తిరుపతి మంగళం : పేద విద్యార్థులను వైద్యవిద్యకు దూరం చేసేలా చంద్రబాబు విద్వేషపూరితంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. సోమవారం తిరుపతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల జగనన్న పాలనలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారని వెల్లడించారు. పేద బిడ్డలు సైతం వైద్యవిద్యను అభ్యసించాలనే మహోన్నత ఆశయంతో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 17 మెడికల్ కళాశాలలను నిర్మించారని కొనియాడారు. అయితే రాజకీయ కక్షతో కూటమి ప్రభుత్వం వైద్య కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు తెగబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల ఆశలను అడియాసలు చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెడికల్ కళాశాల ఏర్పాటుకు జగనన్న చేసిన కృషి ఫలించకుండా చంద్రబాబు రాహువులా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో రూ.3లక్షల కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా చంద్రబాబు చేసిన మేలు ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కీలుబొమ్మ హోంమంత్రి అనితకు దమ్ముంటే ఆమె పక్క జిల్లాలోని పాడేరు మెడికల్ కళాశాల, ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న విజయనగరం జిల్లాలోని మెడికల్ కళాశాల వద్దకు రావాలని సవాల్ విసిరారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా జగనన్న సారథ్యంలో అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మాట్లాడుతూ జగనన్న నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2,600 మెడికల్ సీట్లు ఉన్నాయని, ఈ 17 మెడికల్ కళాశాలలు పూర్తయితే..4వేలకు పైగా సీట్లు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈఓ

తిరుమల: శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తిరుమలలోని విధాత నిలయం వద్ద టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పుష్ప గుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించా. మంగళవారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ హరి జవహర్ లాల్, టీటీడీ సీవీఎస్ఓ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కనికరం లేని కూటమి

- చిన్నపిల్లల ఆస్పత్రిపై ద్వేషం తగదు
- టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన





చిన్నపిల్లల ఆస్పత్రిని పరిశీలిస్తున్న భూమన (ఇన్‌సర్ట్) కార్డియాక్ న్యూరో బ్లాక్‌ను పరిశీలిస్తూ..

తిరుపతి తుడా : చిన్నపిల్లలనే కనికరం కూడా లేకుండా కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా పాలన సాగిస్తోందని టీటీడీ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. సోమవారం అలిపిరి సమీపంలో నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పరిశీలించారు. భూమన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానస పుత్రికగా రూ.302 కోట్లతో ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు కుట్రపూరితంగా ఆస్పత్రి పనులను నిలిపివేసిందని ఆరోపించారు. దీనిపై మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రశ్నించడంతో తూతూమంత్రంగా మళ్లీ పనులు చేపట్టిందని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేని లోటును నాటి సీఎం వైఎస్ జగన్ గుర్తించి, టీటీడీ సహకారంలో అత్యున్నత వైద్యప్రమాణాలతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టారన్నారు. ఖరీదైన వైద్యం అందక ఏ తల్లీ తన బిడ్డను పోగొట్టుకోకూడదనే సదుద్దేశంతో ఆలోచించారని కొనియాడారు. 2022లో ఆస్పత్రి పనులు ప్రారంభించి, 2024 ఎన్నికల ముందు నాటికి 75శాతం నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డికి క్రెడిట్ వస్తుందనే దురుద్దేశంతో తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా ఆస్పత్రి పనులను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల ఆస్పత్రిపై ప్రభుత్వానికి, టీటీడీ పాలకమండలికి ఎందుకంత ద్వేషమని ప్రశ్నించారు. కేవలం పేరు కోసం పసిబిడ్డల ప్రాణాలతో చెలగాటమాడడం సరికాదన్నారు. మరో మూడు నెలల్లో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం స్విమ్స్ ప్రాంగణంలోని కార్డియాక్ న్యూరో సైన్సెస్ బ్లాక్‌ను సందర్శించారు. ఈ బ్లాక్ నిర్మాణానికి రూ.97 కోట్లు మంజూరు చేశామని, తమ హయాంలోనే 40శాతం పనులు పూర్తి చేశామని, అయితే కూటమి ప్రభుత్వం ఇది కూడా నిలిపేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్ దేశవ్యాప్తంగా పేరుప్రతిష్ఠలు సాధించిందని తెలిపారు. గతంలో టీటీడీ బోర్డు చైర్మన్‌గా స్విమ్స్ అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించామని వివరించారు. పేద ప్రజలకు ఉపయోగపడే అంశాలను రాజకీయాలతో ముడిపెట్టడం దారుణమని, ఇప్పటికైనా ప్రభుత్వం, టీటీడీ పాలకమండలి కళ్లు తెరవాలని సూచించారు. లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

డిజిటల్ యుగంలో మహిళలు కీలకం

- జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా



సదస్సులో మాట్లాడుతున్న లోకసభ స్పీకర్ ఓంబిర్లా



వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సభ్యులు

తిరుపతి అర్బన్ : డిజిటల్ యుగంలో మహిళలు కీలకమని, కొత్త సాంకేతిక సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని లోకసభ స్పీకర్ ఓంబిర్లా పిలుపునిచ్చారు. జాతీయ మహిళా సాధికారత సదస్సు సోమవారంతో ముగిసింది. ఈ క్రమంలో ముందుగా తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో రెండో రోజు సదస్సును జాతీయ, రాష్ట్ర గీతాలాపనలతో ప్రారంభించారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి, శ్రీరామ పట్టాభిషేకం చిత్ర పటం బహూకరించారు. లోకసభ స్పీకర్ మాట్లాడుతూ భారత్ అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలంటే మహిళలు వందశాతం విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత తొలి సమావేశం నిర్వహించడం ఎంతో సంతృప్తిగా ఉందని వెల్లడించారు.

రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ సింగ్ మాట్లాడుతూ ఒక మహిళను విద్యావంతురాలిని చేస్తే, ఒక తరం విద్యావంతమవుతుందని సావిత్రిబాయి పూలే చెప్పిన మాటలు అక్షర సత్యమన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా హక్కుల కోసం పోరాడి, పురుషుల కంటే మంచి నిర్వాహకులుగా నిరూపించారని గుర్తుచేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మహిళలు రాజకీయ,విజ్ఞానం,సాంకేతికత, వైద్యం,న్యాయరంగాల్లో సాధించిన విజయాలను వివరించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళల సమాన హక్కులు,రాజకీయాలలో మరింత ప్రాతినిధ్యం,విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో అవకాశాలు,సురక్షిత సమాజ నిర్మాణం ఇవన్నీ లక్ష్యాలుగా వెల్లడించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ లింగ సమానత్వం సాధనలో పురోగతి అవసరమని గుర్తుచేశారు. పలువురు మహిళా సభ్యులు మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు పార్లమెంటరీ కమిటీ, సెక్రటేరియట్ టీమ్స్, అధికారుల సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ ఎమ్.జకియా కానం, మహిళా సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి, శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవర, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముక్కంటి సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రసాదాలు అందిస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ సేవించుకున్నారు. సోమవారం ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసాదాల పోటును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తులతో మాట్లాడి ఆలయంలో వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి, ఏఈఓ మోహన్, విద్యాసాగర్, పర్యవేక్షకులు నాగభూషణం, సుదర్శన్, ఏపీఆర్‌ఓ రవి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల తెలంగాణ ఎంపీ డీకే అరుణ తదితరులు



ఎమ్మెల్సీ కళ్యాణి

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో ఎంపీలు రవిచంద్ర, డీకే అరుణ, రాఘవేంద్ర, లక్ష్మీకాంత్ వాజపేయి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే రివాబా జడేజా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

మారిషస్ ప్రధానికి సాదర స్వాగతం.. వీడ్కోలు



మారిషస్ ప్రధానికి జ్ఞాపిక అందిస్తున్న మంత్రి

రేణిగుంట : తిరుపతి- తిరుమల పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రాంగూళం చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్, అనంతపురం డీఐఈ షిమోసి బాజ్‌పేయి, జేసీ శుభం బన్సల్ సాదర స్వాగతం పలికారు. పర్యటన ముగించుకుని రేణిగుంట ఎయిర్‌పోర్టు చేరుకున్న మారిషస్ ప్రధానికి మంత్రితోపాటు అధికారులు వీడ్కోలు పలికారు.

అక్షరమే ఆయుధం

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ప్రభుత్వానికి మధ్య వారధిగా, ప్రభుత్వాల దుర్నీతి పాలనను ఎత్తి చూపుతూ రాసే కథనాలపై పత్రిక ఎడిటర్, విలేకరులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అనుసరిస్తోంది. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాను అణగదొక్కేలా అక్రమ కేసులు పెట్టడం సరికాదు. వైఫల్యాలను, వాస్తవాలను రాస్తున్న సాక్షిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం మంచి పద్ధతి కాదు. సాక్షి పత్రిక, సిబ్బందిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

– వి.రెడ్డిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు.



స్వేచ్ఛను హరించడం తగదు



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ కల్పించాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు మీడియా సమావేశాల్లో తెలియజేసిన విషయాలను కూడా పత్రికల్లో వస్తే నేరమనడం హాస్యాస్పదం. లోటు పాట్లను గురించి వాస్తవాలు రాస్తే పత్రికా యాజమాన్యం పై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. సాక్షి పై కేసు నమోదు చేయడం అన్యాయం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదు. విమర్శలు చేస్తే కేసులు పెట్టడం, ప్రభుత్వ పరిపాలన లోపాలను ఎత్తిచూపితే మీడియా సంస్థలను నియంత్రించాలనుకోవడం అన్యాయం. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

– ప్రకాష్, విద్యావేత్త

అటవీ పరిరక్షణ అందరి బాధ్యత



అధికారులతో మాట్లాడుతున్న మల్లికార్జునరావు

- జనావాసాల్లోకి ఏనుగులు రాకుండా ప్రత్యేక ప్రణాళికలు
- అటవీశాఖ అభివృద్ధి కార్యక్రమాల ప్రభుత్వ సలహాదారు మల్లికార్జునరావు

తిరుపతి మంగళం : అడవులు అంతరించిపోతున్నాయని, వాటి పరిరక్షణను అటవీ అధికారులతో పాటు ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని అటవీశాఖ అభివృద్ధి కార్యక్రమాల ప్రభుత్వ సలహాదారు మల్లికార్జునరావు సూచించారు. తిరుపతి పరిధిలోని ఎస్వీ జూపార్కు, నగర వనాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జూలో ఇటీవల వరుసగా పులులు, సింహాల మరణాలపై అక్కడి అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సందర్శకులకు అందిస్తున్న వసతులు, జంతువులకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. జూను మరింత అభివృద్ధి చేయడంపై జూ క్యూరేటర్, సీసీఎఫ్ సెల్వంతో చర్చించారు. జూలోని జంతువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జనావాల్లోకి ఏనుగులు, చిరుతలు, వన్యప్రాణులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం సీసీఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి వివేక్, డీఎఫ్‌వో శ్రీనివాసులు, సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, ఎఫ్ఆర్‌వోలు సుబ్బరాయుడు, సుదర్శన్‌రెడ్డితో కలిసి నగర వనంలో పర్యటించారు. నగరవనంలో ఏర్పాట్లపై వాకర్లతో మల్లికార్జునరావు మాట్లాడారు. ఎస్వీ జూపార్క్, నగరవనంలో సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేలా తగు చర్యలు చేపట్టాలని అటవీ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

వీడని మిస్టరీ!

- రెండు మృతదేహాలకు పోస్టుమార్టం
- సమీపంలోని గుంతలను నేడు తవ్వనున్న పోలీసులు
- కీలక ఆధారంగా ఘటనాస్థలంలో దొరికిన సెల్‌ఫోన్

పాకాల : అటవీ ప్రాంతంలో ఆదివారం వెలుగుచూసిన మృతదేహాలకు సంబంధించి ఇప్పటికీ మిస్టరీ వీడలేదు. రాత్రంతా పోలీసులు ఘటనాస్థలంలోనే కాపలా కాశారు. మృతదేహాలు కుళ్లిపోయి ఉండడంతో సోమవారం ఉదయం అడవిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. సమీపంలోని రెండు గుంతలను మంగళవారం తవ్వి పరిశీలించాలని నిర్ణయించారు.

హత్యా.. ఆత్మహత్యా..?

అడవిలో మృతదేహాలు ఉన్న ప్రదేశంలో మద్యం సీసాలు పడి ఉన్నాయి. వారు ఆత్మహత్య చేసుకునే ముందు మద్యం తాగారా..? లేకపోతే పురుషుడు మద్యం తాగి మహిళను హత్య చేశాడా.? తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? అనే విషయాలు తేలాల్సి ఉంది. లేకపోతే వీరిని ఎవరైనా అడవిలోకి తీసుకువచ్చి హత్య చేసి, తర్వాత మద్యం తాగారా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికీ సందిగ్ధమే..!

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే సమయంలో వారి నోట్లో గుడ్డలు కుక్కి, ప్లాస్టర్ అందించి ఉండడాన్ని వైద్యులు గుర్తించినట్లు వార్తలు గుప్పుమన్నాయి. దీంతో వారిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించి ఉండడవచ్చనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా అసలు విషయం వెలుగు చూడనుంది. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు బయటకు రానున్నాయి.

పీజీ దరఖాస్తులకు గడువు పెంపు

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి పీజీసెట్-2025 కౌన్సెలింగ్‌కు సంబంధించి దరఖాస్తుల గడువును ఈనెల 17వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు నాగార్జున వర్సిటీ పీజీసెట్ కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీలకు సంబంధించి పలు పీజీ కోర్సుల్లో 10వేల దరఖాస్తులు అందాయని తెలిపారు. దీంతో మరో రెండు రోజుల పాటు పీజీ కోర్సులకు గడువు పెంచినట్లు పేర్కొన్నారు. 20న ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పించి 22, 23 తేదీల్లో సీట్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

7 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

నారాయణవనం: మండల పరిధిలో సోమవారం అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం, ట్రాక్టర్, మినీ లారీని సీజ్‌చేసి, ఇద్దరిని అదుపులో తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని వైకుంఠపురం కేంద్రంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందినట్టు ఎస్‌ఐ చెప్పారు. వెంటనే అక్కడకు వెళ్లి పరిశీలించి ఓ ట్రాక్టర్, మినీ లారీలో లోడ్‌చేసిన 7 టన్నుల బరువున్న 140 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అళ్లిముత్తు, షేక్ మహ్మద్ బాషాను అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారణలో నగరికి చెందిన అమృతరాజ్ నాడార్, కీళగరంకు చెందిన అరుణాచలం, శ్రీకాళహస్తికి చెందిన గజ స్థానికంగా తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలుచేసి తమిళనాడు, చిత్తూరు జిల్లాలోని కోళ్ల పారాలకు, హోటళ్లకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసిందని అన్నారు. ఈమేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. అరెస్టు చేసిన అళ్లిముత్తు, షేక్ మహ్మద్‌బాషాను రిమాండ్‌కు పంపినట్టు ఆయన వివరించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట-పోలిరెడ్డిపాళెం రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం రైలు నుంచి జారి పడి సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై లైట్ సిమెంట్ కలర్ చిన్న గళ్ల చొక్కా, తెలుపు నీలం రంగు పెద్ద గళ్ల లుంగీ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు చెన్నై- నెల్లూరు మెమో రైలు రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైలును మంగళవారం రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి సోమవారం తెలిపారు. పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల కారణంగా మెమో రైలును రద్దు చేసినట్లు వెల్లడించారు.

19న ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈనెల 19న ఎంబీఏ విభాగంలో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఎ.సువర్ణలతా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు 19వ తేదీ ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంబీఏ విభాగంలో హాజరు కావాలన్నారు. వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్వీయూ అధికారుల తీరుపై ఆగ్రహం



వీసీకి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ అధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వర్సిటీలోని సమస్యలపై సోమవారం అన్నమయ్య భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వర్సిటీ అధికారులు అడ్డకట్ట వేశారు. దీంతో మండిపడిన విద్యార్థి సంఘాల నేతలు యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఐసా, పీడీఎస్ఓ, ఎన్ఎస్‌యూఐ, జీఎన్ఎస్, జై భారత్ నేషనల్ పార్టీ విద్యార్థి విభాగం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ 70 ఏళ్ల విశ్వవిద్యాలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థి సంఘాలను అణగదొక్కేందుకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు యత్నిస్తున్నారని ఆరోపించారు. నేపాల్ పరిస్థితులను తలపించేలా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ అధికారుల అవినీతిని బయటపెడుతున్నందుకే సెమినార్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశానికి అనుమతి మంజూరు చేయకుండా ఉత్వర్వులు జారీ చేశారని ఆరోపించారు. అధ్యాపకుల లెటర్ ప్యాడ్‌పై మాత్రమే సెమినార్ హాల్ ఇస్తామని చెప్పి, ఎవరైనా అధ్యాపకులు లెటర్ ఇస్తే జీతాలు నిలిపివేస్తామని రిజిస్ట్రార్ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీసీకి వినతి పత్రం సమర్పించారు. నేతలు అక్బర్, రవి, ఉదయ్, ప్రవీణ్, మల్లికార్జున, చిన్నా, శివశంకర్‌నాయక్, లోకేష్, భార్గవ్ పాల్గొన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

చిల్లకూరు: వెంకటగిరి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు సోమవారం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాలు.. సోమవారం మధ్యాహ్నం నెల్లూరు నుంచి ఆర్టీసీ బస్సు వెంకటగిరి బయలుదేరింది. బస్సు కొమ్మనేటూరు సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ కునుకుతీశాడు. బస్సు అదుపు తప్పింది. డ్రైవర్ తేరుకునే సరికే బస్సు రోడ్డు పక్కనే ఉన్న బస్సు షెల్టర్‌ను, తరువాత ఓ దుకాణాన్ని ఢీకొని ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి నిలిచిపోయింది.ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. బస్సు మరో రెండు మీటర్లు వెళ్లి ఉంటే హై టెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పెద్ద ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వీఐపీలకే మా సేవ!



వీఐపీల కోసం స్వాగత తోరణాలు



ప్రత్యేకంగా స్టాల్స్



రెడ్ కార్పెట్‌తో వెల్‌కమ్..

సామాన్య భక్తులకే ప్రాధాన్యమంటారు.. సులభతరంగా ముక్కంటి దర్శనం కల్పిస్తామంటారు.. చిన్నపాటి ఇబ్బంది కూడా తలెత్తకుండా సకల వసతులు కల్పిస్తామంటారు. అయితే ఆచరణలో మాత్రం తూతూమంత్రంగా అమలు చేస్తుంటారు. అదే వీఐపీలు వస్తున్నారంటే రెడ్‌కార్పెట్ పరిచేస్తారు. తోరణాలతో స్వాగతం పలుకుతారు. ప్రముఖుల సేవకు వైద్యసిబ్బందిని సిద్ధం చేస్తారు. వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసుకుని ఆదాయం ఆర్జించేందుకు అధికార పార్టీ కార్యకర్తలకు అనుమతులు మంజూరు చేస్తారు. దూరాభారం నుంచి వచ్చిన భక్తులను పక్కకు నెట్టి వీఐపీ దర్శనాలకు దారులు తీస్తారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇదే దృశ్యం ఆవిష్కృతమైంది. జాతీయ మహిళా సాధికారత సదస్సుకు వచ్చిన ప్రతినిధులకు ముక్కంటి ఆలయంలో రెడ్‌కార్పెట్ మర్యాద లభించింది.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

మహద్భాగ్యం.. శ్రీవారి దర్శనం



మారిషస్ ప్రధానమంత్రికి శ్రీవారి చిత్రపటం అందిస్తున్న మంత్రి, టీటీడీ చైర్మన్, అధికారులు

తిరుమల : తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం మహద్భాగ్యమని మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రాంగూళం తెలిపారు. సోమవారం ఆయన తిరుమల శ్రీవారిని సేవించుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో ఆయనకు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో 'క్వాంటమ్ వ్యాలీ'



కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమిక్ ప్రోగ్రామ్ పరిధిలో క్వాంటమ్ వ్యాలీని సోమవారం ప్రారంభించారు. సాంకేతిక విద్యలో తాజా పరిణామాలు, సాధించాల్సిన అభివృద్ధిపై వారం రోజుల పాటు చర్చించనున్నారు. వీసీ ఉమ మాట్లాడుతూ ప్రభుత్వం అమరావతిని క్వాంటమ్ వ్యాలీతో పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రంగా అభివృద్ధి చేయబోతోందన్నారు. డాక్టర్ వై.భవాని కుమార్ మాట్లాడుతూ క్వాంటమ్ టెక్నాలజీస్‌లో ప్రోగ్రామింగ్ ప్రాక్టికల్ అంశాలను వివరించారు. రిజిస్ట్రార్ రజని, ప్రొఫెసర్ మల్లికార్జున, ప్రొఫెసర్ పి. వెంకట కృష్ణ, కో-ఆర్డినేటర్ వి.సరిత పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 85 అర్జీలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 100 ఫిర్యాదులు అందినట్టు ఏఎస్పీలు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

మమ్మల్ని ఎందుకు మోసం చేశారు?

'ఏడేళ్ల నుంచి డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యా.. డీఎస్సీలో ఎంపికయ్యా. కాల్‌లెటర్ పంపారు. సర్టిఫికెట్లన్నీ పరిశీలించి ఓకే అన్నారు. చివరికి తుది ఎంపిక జాబితాలో ఎంపికకాలేదని చెప్పారు'..అంటూ పలమనేరుకు చెందిన సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు పోస్టులు వచ్చాయన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక తమ ఆశలను నీరుగార్చడం అన్యాయమని ఆవేదన చెందాడు.

'ఎస్జీటీ పోస్టుకు ఎంపికైనట్లు మెసేజ్ పంపారు. కాల్‌లెటర్ జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన మొత్తం పూర్తి చేశారు. ప్రస్తుతం తుది జాబితాలో నా పేరు లేదు..' అని శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళా అభ్యర్థిని కన్నీరుపెట్టుకున్నారు. సోమవారం డీఈవో కార్యాలయానికి విచ్చేసిన తనకు జరిగిన అన్యాయంపై అధికారులను ప్రశ్నించారు. తన తర్వాత ర్యాంక్ ఉన్న వారికి పోస్టు ఇచ్చారని ఆరోపించారు.

ఈ ఇద్దరే కాదు.. సోమవారం చిత్తూరు డీఈవో కార్యాలయానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వందలాది మంది అభ్యర్థులు క్యూకట్టారు. కాల్‌లెటర్లు అందిన తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ అధికారులను ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అంటూ విమర్శలు ఎక్కుపెట్టారు.

- మెగా డీఎస్సీ తుది జాబితాలో పలువురు అభ్యర్థులకు అన్యాయం
- దూరప్రాంతాల నుంచి డీఈవో కార్యాలయానికి పరుగులు
- అవమానించి మోసం చేశారంటూ కూటమి ప్రభుత్వం పై విమర్శలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి, శ్రీకాళహస్తి, మదనపల్లి, కుప్పం, చిత్తూరు, పుత్తూరు పలు ప్రాంతాల నుంచి మెగా డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి విచ్చేశారు. ర్యాంకు, మార్కుల పరంగా అర్హత ఉన్న తమకు అన్యాయం జరిగిందంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. పీఈటీ, ఇతర కేటగిరిలతోపాటు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి సర్టిఫికెట్లు సమగ్రంగా విచారించలేదని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్, పీహెచ్ కేటగిరీల్లో అనర్హులకు అందలం ఎక్కించారన్నారు.

తుది జాబితాలో 1,408 మంది ఎంపిక

రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సోమవారం ప్రచురించిన మెగా డీఎస్సీ తుది జాబితాలో 1,408 మంది ఎంపికైనట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్‌లలో 1,478 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ ప్రక్రియ తుది జాబితా ప్రచురణ నాటికి పలు కేడర్‌లలో 1,408 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. తుది ఎంపిక జాబితాలను కలెక్టరేట్, డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులలో ప్రచురించారు. తుది జాబితాలో అభ్యర్థులకు ఎవరైనా అభ్యంతరాలున్నట్లైతే కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ 8498991250 నెంబర్‌లో తెలియజేయాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు.



డీఈవో కార్యాలయంలో తమకు ఎలా అన్యాయం జరిగిందంటూ ప్రశ్నిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఎస్సీ తుది ఎంపిక

మేనేజ్‌మెంట్	నోటిఫైడ్ పోస్టులు	ఎంపికైన పోస్టులు	అర్హత లేక భర్తీ కాని పోస్టులు
ప్రభుత్వ, లోకల్‌బాడీస్	1,312	1,254	58
మున్సిపాలిటీ	64	57	07
మున్సిపల్ కార్పొరేషన్	97	92	05
ట్రైబల్‌ఆశ్రమ పాఠశాలలు	05	05	00
మొత్తం పోస్టులు	1,478	1,408	70